క్లుప్తంగా

కొయ్యూరు ఎంపీడీవోగా ప్రసాద్ నియామకం

కొయ్యూరు: కొయ్యూరు ఎంపీడీవోగా ప్రసాద్ నియామకమయ్యారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారి(ఏవో)గా పనిచేస్తున్న అతనికి పదోన్నతి కల్పించి కొయ్యూరు ఎంపీడీవోగా నియమించారు. కిందటి సంవత్సరం కొయ్యూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న మేరీరోజ్ గొలుగొండకు బదిలీ అయ్యారు.దీంతో ఇక్కడ ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న ప్రసాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. కొత్తగా ఎంపీడీవో చేరనుండడంతో ఆయన ఆ బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత

గూడెంకొత్తవీధి: ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పెదవలస వారపు సంతలో నాగసాయి బృందం కళాజాత ప్రదర్శించింది. ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, అవి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర విషయాలను నాటిక రూపంలో వివరించారు. మండల ఉపాధ్యక్షుడు ఆనంద్, వైద్యులు కోమలి, పృధ్వీష, హెచ్‌ఈ శ్రీనివాస్, హెచ్‌వి రోజి గోల్డ్, ఏఎన్‌ఎం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ-గవర్నెన్స్‌పై అవగాహన



సూచనలిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: ప్రభుత్వం అమలు చేస్తున్న వాట్సప్ యాప్ గవర్నెన్స్ ప్రజలకు మరింత అవగాహన పెంచాలని రాజవొమ్మంగి ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు అన్నారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామవార్డు సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి, వాట్సప్ యాప్ గవర్నెస్ సేవలను వివరించాలన్నారు. దీంతో పాటు ఆధార్‌కార్డులు లేని పీవీటీజీలను గుర్తించాలని సూచించారు. సిటిజన్ ఈకేవైస్, మలేరియా నిర్మూలన తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు.

తాగునీటి పంపు మోటార్ ఏర్పాటు



తాగునీటి మోటర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

వి.ఆర్.పురం: గత వారంరోజులుగా చిన్నమట్టపల్లి పంచాయతీ ప్రతిపాక గ్రామంలో తాగునీటి పంపు మోటార్ పాడైంది. దీంతో స్థానికులు తాగునీటికి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు సర్పంచ్ పిట్టా రామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి కొత్త మోటర్ ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో రమణి తదితరులు

చింతపల్లి: కిశోర బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవడంతో రక్త హీనతను తగ్గించుకోవచ్చని సీడీపీవో జి.వి.రమణి అన్నారు. పెదబరడ పంచాయతీలోని సిరిపురం గ్రామంలో కిశోర వికాసం వేసవి సెలవులు కార్యక్రమాన్ని నిర్వహించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు అప్పలనర్సమ్మ, గౌహరున్నీసా, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనిల్ కుమార్

వి.ఆర్.పురం: మండల కేంద్రంలో డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 ద్వారా సేవలు కొనసాగుతున్నాయన్నారు. భవ్య సంస్థ ఆధ్వర్యంలో 104 సేవలు అందుబాటులో రానున్నట్టు చెప్పారు. డీఈవో వరప్రసాద్, డ్రైవర్ ఏసురాజు, ఏఎన్‌ఎం, ఆశా వర్కలు తదితరులు పాల్గొన్నారు.



చెత్తను సేకరించే రిక్షా



పాడై మూలకు చేరిన చెత్త సేకరణ రిక్షాలు

పడకేసిన పారిశుధ్యం



జీసీసీ గొడాము వద్ద చెత్త కుప్ప



వెలుగు కార్యాలయం సమీపంలో పేరుకుపోయిన చెత్త..

- నిరుపయోగంగా చెత్త సేకరణ రిక్షాలు
- రహదారులపై పేరుకుపోయిన చెత్తకుప్పలు
- దుర్వాసనతో స్థానికుల అవస్థలు
- ప్రబలుతున్న రోగాలు
- పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత కనుమరుగవుతోంది. రోడ్ల పక్కన, విధుల్లో ఎక్కడికక్కడే కుప్పలుగా చెత్త పేరుకుపోయి ఉంది. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్త తొలగింపులో చిత్తశుద్ధి కరువవుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ సంకల్పం పేరుతో వాహనాలు ఏర్పాటు చేసి చెత్తను ప్రతి రోజు తొలగించేవారు. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణ లేక చెత్తను సేకరించే వాహనాలు పాడై మూలకు చేరాయి. దీంతో పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. గత కొన్ని రోజులుగా మండల కేంద్రంలో పలు ప్రాంతాలు చెత్తతో కంపు కొడుతున్నాయి. వెలుగు కార్యాలయం సమీపంలో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. జీసీసీ గోదాము ఎదుట, మండల కేంద్రం నుంచి జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గంలో గ్యాస్ గోదాము వద్ద, ఎంపీడీవో క్వార్టర్స్, హోలీ క్రీడా మైదానం, అంబేడ్కర్ పార్కు తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చెత్త కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తోంది. రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా మారింది. తీవ్ర దుర్గంధంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేవారు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

దీనికి తోడు ఈగలు, దోమల బెడదతో ప్రాంతాల వాసులు సతమతమవుతున్నారు. రాత్రిపూట దోమలతో కంటిమీద కునుకు ఉండడంత లేదని , రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాడైన వాహనాలు

ముంచంగిపుట్టు మండల కేంద్రంలో చెత్త సేకరణ కోసం కేటాయించిన రిక్షా వాహనాలు పాడైయాయి. మండల కేంద్రంలో సుమారు 10 రిక్షాలను అధికారులు కేటాయించారు. ప్రస్తుతం రెండు మినహా మిగిలినవన్నీ పూర్తిగా నిరుపయోగంగా మారాయి. పాడైన వినియోగించేందుకు వీలు లేకుండా తయారయ్యాయి. ఎంపీడీవో క్వార్టర్స్ ప్రాంగణంలో పాడైన వాహనాలు పడి ఉన్నాయి. రిక్షాలు సక్రమంగా లేకపోవడంతో చెత్త సేకరణకు పారిశుధ్య కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కానరాని డస్ట్‌బిన్లు

మండల కేంద్రంలో దుకాణాల ముందు ఎటువంటి డస్ట్‌బిన్‌లు లేవు. దీంతో దుకాణదారులు వేసిన చెత్త రోడ్లుపై పేరుకుపోతూ దర్శనమిస్తుంది. ప్రధాన మార్గాలంతా చెత్తతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. పంచాయతీ అధికారులు గానీ, దుకాణదారులు గానీ చెత్తను వేసేందుకు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయకపోవడంతో రహదారులన్నీ అపరిశుభ్రంగా మారాయి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దని ప్రకటనలు,అ వగాహన ర్యాలీలు కేవలం ప్రచారం ఆర్భాటాలు తప్ప ఆచరణలో కానరావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన్నా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలోని అన్ని ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని, దీంతో పాటు ప్రతి దుకాణం ముందు డస్ట్‌బిన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

మండల కేంద్రంలో ఎప్పటికప్పుడు చెత్తను తొగించేలా చర్యలు తీసుకుంటున్నాం. పారిశుధ్య కార్మికులు చెత్తను ప్రతి రోజు తొలగిస్తున్నారు. ప్రతి షాపు ఎదుట డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని దుకాణదారులకు అనేక సార్లు చెప్పడం జరిగింది. దుకాణాల ఎదుట చెత్త ఉంటే కఠిన చర్యలు తప్పవు. పారిశుధ్యం మెరుగునకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. దుకాణదారులు, ప్రజలు అధికారులకు సహకరించాలి.

– సూర్యనారాయణమూర్తి, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

భూ పట్టాల కోసం వినతి



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ అభిరామ్, రైతులు

కూనవరం: మండలంలోని చినార్కూరు, బండారు గూడెం గ్రామాల మధ్యలో ఉన్న (భూములు) గ్యాప్ ఏరియా భూములకు పట్టాదారు పాస్‌బుక్‌లు ఇవ్వాలని కోరుతూ చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్ ఆధ్వర్యంలో ఆయా భూములు సాగుచేస్తున్న గిరిజన రైతులు స్థానిక తహసీల్దార్ కె.శ్రీనివాసరావుకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. గతంలో పోడు భూములకు పట్టాలు ఇచ్చారని, వాటిని వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయపోవడంతో పీఎం కిసాన్ తదితర ప్రభుత్వ పథకాలు రైతులకు అందడం లేదని వినతిలో పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించి తమను ఆదుకోవాలని కోరారు. స్థానికులు గోపయ్య, రవి, వెంకన్న బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

వి.ఆర్.పురం: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కోటం జయరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గుండుగూడెం, చింత రేగిపల్లి గ్రామాల్లో ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు జరిగి 20 రోజులు కావస్తున్నా నిర్వాసితుల జాబితాను అధికారులు ప్రకటించలేదన్నారు. ఐటీడీఏ పీవో స్పందించాలని ఆయన కోరారు.

అవగాహనతోనే డెంగ్యూ నివారణ



డెంగ్యూ నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం తదితరులు



జీకే వీధిలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది



డుంబ్రిగుడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



చింతపల్లిలోని ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు,సిబ్బంది



ఎల్లవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



అడ్డతీగలలో డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



కూనవరంలో డాక్టర్ రాజీవ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డుంబ్రిగుడ: జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిపారు. వాడవాడలా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ అవగాహనతోనే డెంగ్యూ వ్యాధి నివారణ సాధ్యమన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నివాస ప్రాంతాల్లో టైర్లు, పాత సామగ్రి, కుండీల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. నీటి నిల్వ వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఫలితంగా దోమకాటు వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు. డుంబ్రిగుడలో వైద్యాధికారులు పి.రాంబాబు, అంబిక రమణి, రామారావు, స్వామి, సంజీవ్, రవీంద్ర, ప్రభాకర్, హరి తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు కోమలి, పృధ్వీష, హెచ్‌ఈ శ్రీనివాస్, ఎల్‌టీ రమాదేవి, సిబ్బంది జయశ్రీ, రోజ్‌గోల్డ్, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి లావణ్య, రాజారవీంద్ర, శ్రావణి, సౌమ్య, హెచ్‌వి శాంతకుమారి, సత్యారావు, కుమారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని జరిగిన కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పండా సతీష్, వైద్యాధికారి నాగప్రత్యూష, వైద్యులు దేవీ ప్రియాంక, పిహెచ్‌సి విస్తరణాధికారి శ్యాంబాబు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అశోక్, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, వాసు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని జరిగిన కార్యక్రమంలో వైద్యుడు రాజీవ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు రత్నం, అర్జున్, ఎంఎల్‌హెచ్‌పీ వెంకటేశ్వర్లు, , మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి , పంచాయతీ సెక్రటరీ రవి, సిబ్బంది కృపానందం, సోమినాయుడు, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కింద్రలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ వెంకటలక్ష్మి తదితరులు

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

- భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి
- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



సమావేశంలో మాట్లాడుతున్న అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

డుంబ్రిగుడ, అరకులోయటౌన్(అనంతగిరి): అనంతగిరి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని భీంపోలు పంచాయతీలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్థానికంగా నివసిస్తూ భూమి లేని గిరిజనులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూ ఆక్రమణలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రెవెన్యూ శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో తప్పిదాలు చేసిన రెవెన్యూ సిబ్బంది వారి తీరు మార్చుకోవాలన్నారు. గిరిజనులకు భూముల పంపిణీలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ శాఖల పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మలేరియా, డెంగ్యూ నివారణ చర్యల్లో భాగంగా పోస్టర్‌ను ఆవిష్కరించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యే దృష్టి పెట్టాలని వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు. జెడ్పీటీసీ దిసారి గంగరాజు, ఎంపీడీవో కుమార్, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



యర్రంరెడ్డిపాలెంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న చవిటిదిబ్బలు వైద్యాధికారులు, సిబ్బంది

వై.రామవరం: మండలంలోని యర్రంరెడ్డిపాలెం కోట గ్రామాల్లో సుమారు 40 మంది వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారులు నరేంద్ర, దినేష్ ఆధ్వర్యంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తు, నీటినిల్వలు ఉన్న వస్తువులలోని నీటిని పారబోస్తు, సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, నరేంద్ర, దినేష్‌లు మాట్లాడుతూ నీటి నిల్వల వలన మలేరియా డెంగ్యు, చికున్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ముందు జాగ్రత్త చర్యగా గ్రామాలను, ప్రతీ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే విషజ్వరాలను చాలా వరకు అరికట్టవచ్చునన్నారు. ప్రజలంతా స్పందించి ఆరోగ్య సూత్రాలను పాటిస్తు, ప్రతీ ఒక్కరు మంచి ఆరోగ్యంతో ఉండడానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో జ్వరపీడుతుల వద్ద సిబ్బంది రక్తనమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. విడతల వారీగా అన్ని గ్రామాల్లోను ఈ స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌లు చెప్పారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న జేఈ నాగేశ్వరరావు

వి.ఆర్.పురం: మండలంలోని పెద్దమట్టపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జేఈ నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కేటాయించిన కొలతల ప్రకారమే పనులు చేయాలని, ఈ మేరకు వేతనం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక క్యూబిక్ మీటర్‌కు రోజుకు వేతనం రూ.290 నుంచి రూ.307ల వరకు అందజేస్తామన్నారు. ఉపాధి పనులకు జాబ్‌కార్డు కావల్సిన ఫీల్డ్ అసిస్టెంట్‌లను సంప్రదించాలని సూచించారు. ఉపాధి వేతనదారులు పీఎం జీవన్‌జ్యోతి యోజన సురక్ష జీవన్ భీమా పథకాల నమోదు కోసం తమ ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలను అందజేయాలని కోరారు. కంపోస్టు ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు శంకర్, భూపతి, అశోక్, శ్రీనివాస్, అనిల్ కుమార్, సింహాచలం, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధి మల్లేష్

చింతపల్లి: మండలంలోని లంబసింగి పంచాయతీలోని నూతిబంద గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విద్యార్థులు, యువతకు కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మల్లేష్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదవాలని, భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. బాల్య వివాహాల అనర్థాలను వివరించారు. యువత చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక యువతకు వాలీబాల్ కిట్‌లను, మహిళలు చీరలను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు తిరుపతిబాబు, దావీదు, గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

డ్రైనేజీలు నిర్మించాలి



సాయినగర్ వీధిలో కాలువ శుభ్రం చేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి చిన్నయ్యపడాల్

చింతపల్లి: మండల కేంద్రంలో గల సాయినగర్ వీధిలో డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ ఎన్నికలు అనంతరం తొలి సమావేశంలోనే ఈ వీధిలో డ్రైనేజీ నిర్మాణంపై తీర్మాణం చేసినప్పటికీ నేటికి కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో పాటు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులపై మురుగు నీరు ముంచెత్తుతుండడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలక వర్గం డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ రామకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

చింతపల్లి: మండలం కేంద్రంలోని అంతర్ల గ్రామంలోని బస్ షెల్టర్ స్థలం ఆక్రమణకు గురి కావడంతో స్థానిక యువకులు తహసీల్దార్ రామకృష్ణకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అంతర్లలో ఉన్న బస్ షెల్టర్‌ను తొలగించారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించుకోవడాన్ని స్థానిక యువకులు అడ్డుకున్నారు. ఈ మేరకు స్థలం ఆక్రమణపై తహసీల్దార్ ఫిర్యాదు చేసినట్టు స్థానిక యువకులు తెలిపారు.

గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ , ఎంపీడీవో

గూడెంకొత్తవీధి: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని పి.కె.గూడెంలో శుక్రవారం పీఎం జన్‌మన్ గృహాలకు గ్రౌండింగ్ మేళాను నిర్వహించారు. ఎంపీపీ బోయిన కుమారి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సర్పంచ్ కొర్రా సుభద్ర, గృహాలను గ్రౌండింగ్ చేయించారు.వారు మాట్లాడుతూ వెంటనే గృహాలను పూర్తి చేసుకోవాలన్నారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

కొయ్యూరు: డీఎస్సీలో అల్లూరి జిల్లాలో భర్తీ చేయనున్న 881 పోస్టులను మినహాయించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు డిమాండ్ చేశారు. జీవో నెంబర్-3 పునరుద్ధరణ చేయకపోవడంతో డీఎస్సీలో స్థానిక గిరిజన అభ్యర్థులకు అన్యాయం జరుగుతందన్నారు. ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని కోరారు.